

ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణంలో వేగం పెంచాలి 3 లో

కెరటం న్యూస్
( సామాన్యుడి ఆయుధం )
Published from.. Hyderabad, Khammam, Warangal, Nalgonda
సంపుటి : 04 సంచిక :143 | శుక్రవారం 23 మే 2025 | ఎడిటర్ : వనం నాగయ్య | పేజీలు : 4 ఫోన్ : 9441877695



జర్నలిస్టుల ఫోరం వాల్ పోస్టర్ ను ఆవిష్కరించిన మంత్రి పొంగులేటి 4 లో

# తెలంగాణ రాజకీయాల్లో సంచలనం.. కేసీఆర్‌కు ఎమ్మెల్సీ కవిత లేఖ!



2 లో

● కేసీఆర్ కు ఆరు పేజీల లేఖ రాసిన కవిత ● కేసీఆర్‌కు రాసిన లేఖలో అసంతృప్తి, వరంగల్ సభపై తీవ్ర వ్యాఖ్యలు! ● పార్టీ నేతలకు యాక్సెస్ ఇవ్వడంలేదు ● బీజేపీతో కేసీఆర్ పొత్తు పెట్టుకుంటారని ప్రచారం చేస్తున్నారు ● వరంగల్ సభలో బీజేపీని ఇంకొంచెం టార్గెట్ చేయాల్సిందేమో డాడీ - లేఖలో పేర్కొన్న కవిత

# రాష్ట్రంలో మాఫియాలు రాజ్యమేలుతున్నాయి..!

● అవినీతి పెరిగిందని తీవ్ర విమర్శలు
● రాష్ట్రంలో 77 వేల కోట్ల అప్పుల భారం
● రైతు భరోసా, అమ్మఒడి వంటి పథకాలను నిలిపిన టీడీపీ
● లిక్కర్ స్కాంలో టీడీపీ ప్రైవేట్ మాఫియాతో అనుబంధం: జగన్



2 లో

**న్యూస్ డెస్క్, 22 మే (కెరటం న్యూస్):** ఆంధ్రప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు వైఎస్ జగన్ మోహన్ రెడ్డి అమరావతిలో మీడియాతో మాట్లాడారు. ఈ సందర్భంగా రాష్ట్ర పాలన, అవినీతి, అమరావతిలో జరుగుతున్న దోపిడీపై తీవ్ర స్థాయిలో విమర్శలు చేశారు. ఇందులో భాగంగా ఆయన మాట్లాడుతూ.. రాష్ట్రంలో మట్టి మాఫియా, ఇసుక మాఫియా వంటి అన్ని రకాల మాఫియాలు రాజ్యమేలుతున్నాయని అన్నారు.

# హద్దులు దాటుతున్నారు.. ఈడీ దాడులపై తీవ్ర ఆగ్రహం



2 లో

**న్యూస్ డెస్క్, 22 మే (కెరటం న్యూస్):** తమిళనాడు ప్రభుత్వ ఆధ్వర్యంలో నడిచే మద్యం సంస్థ టాస్మాక్‌పై చేస్తున్న ఈడీ దాడులపై దేశ సర్వోన్నత న్యాయస్థానం సీరియస్ అయింది. ఈడీ అన్ని హద్దులు దాటిందంటూ ఆగ్రహం వ్యక్తం చేసింది. భారత ప్రధాన న్యాయమూర్తి బీఆర్ గవాయ్.. కేంద్ర సంస్థకు వ్యతిరేకంగా తీవ్ర వ్యాఖ్యలు చేశారు. శాంతిభద్రతలు రాష్ట్రానికి సంబంధించిన అంశం.. రాష్ట్రంలో ఈడీ చర్యలు అసమానమైనవిని.. అంతేకాకుండా రాజ్యాంగ విరుద్ధమని న్యాయస్థానం వ్యాఖ్యానించింది.

# నేను చేసిన తప్పేందో చెప్పాలి..

● కాంగ్రెస్ నాయకురాలు సునీతా రావు



2 లో

**న్యూస్ డెస్క్, 22 మే (కెరటం న్యూస్):** తెలంగాణ కాంగ్రెస్ మహిళా విభాగం అధ్యక్షురాలు సునీతరావుకు ఆలిండియా కాంగ్రెస్ మహిళా ఇటీవలే షోకాజ్ నోటీసులు జారీ చేసి విషయం తెలిసిందే. పార్టీ పదవులు విషయంలో ఆమె ఇటీవలే కొంతమంది మహిళా నేతలతో కలిసి గాంధీ భవన్‌లో టీపీసీసీ చీఫ్ మహేశ్ కుమార్ చాంబర్ ఎదుట బైఠాయించిన విషయంలో అధిష్టానం సీరియస్ అయింది.

# నరమేధం ఆపండి..

● నంబాల కేశవరావు ఎన్కౌంటర్‌ను ఖండించిన ఎమ్మెల్సీ కోదండరాం



2 లో

**న్యూస్ డెస్క్, 22 మే (కెరటం న్యూస్):** కేంద్ర ప్రభుత్వం నరమేధాన్ని ఆపాలని మావోయిస్టులతో శాంతి చర్చలు జరపాలని ఎమ్మెల్సీ కోదండరాం అన్నారు. ఆయన మీడియాతో మాట్లాడుతూ... మావో అగ్రనేత నంబాల కేశవరావు ఎన్కౌంటర్‌ను ఖండించారు. మనుషులను వెంటాడి చంపడం మానవతా విలువలకు, చట్టానికి విరుద్ధం అని అన్నారు.

# భూ భారతి చట్టంతో భూ సమస్యలకు శాశ్వత పరిష్కారం


## ● మంత్రి పొంగులేటి



**ఖమ్మం బ్యూరో, 22 మే (కెరటం న్యూస్):** ప్రభుత్వం భూ భారతి, ఇందిరమ్మ ఇండ్లు అంశాలను ప్రతిష్టాత్మకంగా తీసుకొని, ప్రజల సమస్యల పరిష్కారం దిశగా చర్యలు చేపట్టిందని రాష్ట్ర రెవెన్యూ, హౌజింగ్, సమాచార పౌరసంబంధాల శాఖామాత్యులు పొంగులేటి శ్రీనివాసరెడ్డి అన్నారు. గురువారం ఖమ్మం కలెక్టరేట్ సమావేశ మందిరంలో మంత్రి, జిల్లా కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ తో కలిసి పాత్రికేయుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ, ధరణి చట్టాన్ని ప్రక్షాళన చేసి, ప్రజలు మెచ్చే విధంగా భూ భారతి చట్టాన్ని తెచ్చామన్నారు. చట్టం విధి విధానాలపై ప్రజల్లో అవగాహన కు మండల కేంద్రాల్లో అవగాహన సదస్సులు చేపట్టినట్లు, రాష్ట్రంలోని 33 జిల్లాలకు గాను 29 జిల్లాల్లో ప్రత్యక్షంగా తాను పర్యటించినట్లు తెలిపారు. ఏ గ్రామం, ఏ ప్రాంతానికి వెళ్లిన ప్రజలు ధరనితో ఎన్ని ఇబ్బందులు పడ్డారో చూశానని అన్నారు. అన్ని ప్రాంతాల ప్రజలు, ఆసాములు భూ భారతి చట్టంపై సంతోషం వెలిబుచ్చారన్నారు. అన్ని జిల్లాల కలెక్టర్ల నుండి ఫీడ్ బ్యాక్ తీసుకున్నామన్నారు. జిల్లాలోని నేలకొండపల్లి మండలాన్ని పైలట్ మండలంగా ఎంపిక చేసి, అన్ని గ్రామాల్లో రెవెన్యూ సదస్సులు నిర్వహించి, దాదాపు 3200 దరఖాస్తులు స్వీకరించామన్నారు. దరఖాస్తుల్లో 50 శాతానికి పైగా సాదా బైనామ కి సంబంధించి ఉన్నాయని, కోర్ట్ లో సాదా బైనామ కి సంబంధించి కేస్ వెకేట్ కాగానే పరిష్కారానికి చర్యలు చేపడతామన్నారు. జూన్ 2 నాటికి మొదటి విడత పైలట్ మండలాల అన్ని సమస్యలు, రెండో విడత 28 మండలాల్లో సత్వర పరిష్కార సమస్యలన్నీ పరిష్కరిస్తామన్నారు. సాగు యోగ్యమైన అసైన్డ్ భూముల్లో ఉన్న కడు పేదవారికి పట్టాలు ఇస్తామన్నారు. జూన్ 3 నుండి 20 వరకు భూ భారతిచట్టం ద్వారా రెవెన్యూ సమస్యలు పరిష్కారించేందుకు అధికార యంత్రాంగం గ్రామాలకు వస్తుందన్నారు.. ప్రతి భూ సమస్య పరిష్కారానికి అధికారులు చిత్తశుద్ధి తో పనిచేస్తారన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా మొదటి విడతలో 4.50 లక్షల ఇందిరమ్మ ఇళ్లను ప్రభుత్వం పేదవారికి ఇస్తుందని మంత్రి తెలిపారు. అందులో 1.95 లక్షల లబ్ధిదారులను ఇప్పటికే ఫైనల్ చేశామన్నారు. మిగతా 2.55 లక్షల లబ్ధిదారులను ఈ నెలాఖరుకు ఫైనల్ చేస్తామన్నారు. రాష్ట్రంలోని 9800 చెంచు, చెంచు ఉపకులాల కుటుంబాలన్నింటికి పూర్తిగా ఇందిరమ్మ ఇండ్లను అందజేస్తామన్నారు. ఐటీడీఏ ప్రాంతాల్లోని గిరిజనులకు అదనంగా మరో 10 వేల ఇండ్లు ఇస్తామన్నారు



# సనాతన ధర్మం మతోన్మాదం కాదు



2 లో

● పవన్ కళ్యాణ్ జీవ వైవిధ్యంపై కీలక వ్యాఖ్యలు ● ప్రకృతి పరిరక్షణపై పవన్ కళ్యాణ్ హితవు ● చెట్లు, నదులను పూజించడమే మన సంప్రదాయం ● మనం మన రూట్స్ తెలుసుకోవాలి ● చిన్న మార్పు పెద్ద మార్పులకు దారి తీస్తుంది ● నియంత్రణ లేకుండా అడవులను నాశనం చేస్తున్నారు ● అంతర్జాతీయ జీవ వైవిధ్య దినోత్సవం కార్యక్రమంలో పవన్

**న్యూస్ డెస్క్, 22 మే (కెరటం న్యూస్):** విజయవాడలోని తుమ్మలపల్లి కళాక్షేత్రంలో అంతర్జాతీయ జీవ వైవిధ్య దినోత్సవం ఘనంగా నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ హాజరయ్యారు. కోటప్పకొండ పుణ్యక్షేత్రం బయోడైవర్సిటీ పుస్తకాన్ని ఆయన ఆవిష్కరించారు. అనంతరం కార్యక్రమాన్ని ఉద్దేశించి మాట్లాడారు. మరోసారి సనాతన ధర్మం ప్రత్యేకతను ప్రజలతో పంచుకున్నారు. పూర్వీకులు చెట్లను, నదులను పూజించేవాళ్ళని గుర్తు చేశారు. సనాతనధర్మం ఒక మతోన్మాదం కాదని వ్యాఖ్యానించారు.ప్రకృతి నుంచీ తీసుకోవడమే కానీ ప్రకృతికి ఇవ్వడం అలవాటు లేకుండా పోయిందని పవన్ కళ్యాణ్ అన్నారు. ప్రకృతిని పరిరక్షించుకుంటేనే మనం ఉంటామని హితవు పలికారు..

# ఆ విషయంపై దమ్ముంటే లేఖ రాయాలి..

## కేటీఆర్‌కు మహేష్‌గౌడ్ సవాల్

**న్యూస్ డెస్క్, 22 మే (కెరటం న్యూస్):** పాలమూరు రంగారెడ్డి ఎత్తిపోతల పథకం మాజీ మంత్రి కేటీఆ చేసిన వ్యాఖ్యలపై టీపీసీసీ చీఫ్ మహేష్‌కుమార్ గౌడ్ స్పందించారు. పాలమూరు రంగారెడ్డి ఎత్తిపోతల పథకంపై న్యాయస్థానం తీర్పు తమకు అనుకూలంగా ఇచ్చినట్లు, తామంతా నీతిమంతులైనట్లు చెప్పేందుకు కేటీఆర్ ప్రయత్నిస్తున్నారని అన్నారు. 2 లో

# బ్యాంకర్లు ఆర్థికసాయం చేస్తే సమాజానికి మరింత ఉపయోగం

## : భట్టి విక్రమార్క

**న్యూస్ డెస్క్, 22 మే (కెరటం న్యూస్):** జూన్ 2వ తేదీన ఐదు లక్షల యువతకు రాజీవ్ యువ వికాసం పథకం కింద మంజూరు పత్రాలను అందజేసే లక్ష్యంతో బ్యాంకర్ల సహకారం అవసరమని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క తెలిపారు. ఈ పథకంలో రూ. 6,250 కోట్లు సబ్సిడీ రూపంలో యువతకు స్వయం ఉపాధి అవకాశాలు కల్పిస్తామని ఆయన పేర్కొన్నారు.

# కాళేశ్వరాన్ని కూల్చింది వాళ్లే అని నా డౌట్..



2 లో

● కాళేశ్వరంపై నిజానిజాలు త్వరలో తెలుస్తాయి ● కాంగ్రెస్ వాళ్లే కూలగొట్టి ఉంటారని నా డౌట్ ● మేడిగడ్డ దగ్గర బాంబో లేదా మరొకటో పెట్టుంటారు ● కాంగ్రెస్‌లో అలాంటి పని చేసే వాళ్లు ఉన్నారు ● సిద్దిపేటలో మాజీ మంత్రి కేటీఆర్ వ్యాఖ్యలు

**న్యూస్ డెస్క్, 22 మే (కెరటం న్యూస్):** మాజీ మంత్రి కేటీఆర్ సంచలన వ్యాఖ్యలు చేశారు.. గురువారం మీడియాతో మాట్లాడిన ఆయన.. కాళేశ్వరంపై నిజానిజాలు త్వరలో తెలుస్తాయని ఆశాభావం వ్యక్తం చేశారు. "నా డౌట్ అయితే కాంగ్రెస్ వాళ్లే కూలగొట్టి ఉంటారు.. మేడిగడ్డ దగ్గర బాంబో లేదా మరొకటో పెట్టుంటారు.. కాంగ్రెస్‌లో అలాంటి పని చేసే వాళ్లు ఉన్నారు." అని కాంగ్రెస్ నేతలపై సంచలన ఆరోపణలు చేశారు. కాళేశ్వరం విషయంలో నిజం నిలకడగా తేలుతుందని కేటీఆర్ అన్నారు. ఒక బ్యారేజీలో 2 పగుళ్లు వస్తే ఏదో అయినట్లు చేస్తున్నారని విమర్శించారని.. కమీషన్ల నుంచి ప్రజల దృష్టిని మరల్చడానికే కాళేశ్వరం డ్రామా ఆడుతున్నారని మండిపడ్డారు. ఘోష్ విచారణ పూర్తయిందని అని చెప్పి.. ఇప్పుడు నోటీసులు ఇవ్వడమేంటని ప్రశ్నించారు.

సీఎం రేవంత్ రెడ్డిపై కేటీఆర్ విరుచుకుపడ్డారు. సీఎం రేవంత్‌రెడ్డి అపరిచితుడిలా ఉన్నారని విమర్శించారు. అపరిచితుడి సినిమాలోని రెమో, రాము పాత్రలు ముఖ్యమంత్రికి అబ్బుతాయన్నారు. అప్పు పుట్టలేదని రెమో అంటారు.. రూ.లక్షా 60వేల కోట్లు రాము అప్పు చేశారని వ్యాంగ్యాస్త్రాలు సంధించారు.

కెరటం (సామాన్యుడి ఆయుధం) న్యూస్



# భూ భారతి చట్టంతో భూ సమస్యలకు శాశ్వత పరిష్కారం మంత్రి పొంగులేటి

మొదటి పేజీ తరువాయి



. పైలట్ గా ప్రతి మండలం నుండి ఒక్కో గ్రామాన్ని ఎంపిక చేసి, 8 వేల ఇండ్లు నిర్మాణాలు జరుగుతున్నట్లు తెలిపారు. ఇండ్లు ప్రారంభించిన వారికి మొదటి విడత పేమెంట్ అందజేశామన్నారు. ప్రతి సోమవారం పేమెంట్ చేపడు తున్నట్లు తెలిపారు. జూన్ 2 న కనీసం వేయి ఇండ్లు నిర్మాణం పూర్తి చేసి, ప్రారంభోత్సవం చేయడానికి చర్యలు చేపడుతున్నట్లు తెలిపారు. రాబోయే 3-4 సంవత్సరాల్లో 20 లక్షల ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణానికి ప్రణాళికలు సిద్ధం చేశామన్నారు. అర్హులైన ప్రతి పేదవానికి ఇందిరమ్మ ఇళ్ళు ఇస్తామన్నారు. లైసెన్స్ సర్వేయర్లకు నోటిఫికేషన్ ఇస్తే, రాష్ట్ర వ్యాప్తంగా 10 వేలకు పైగా దరఖాస్తులు వచ్చాయన్నారు. 50 పనిదినాల్లో వీరికి శిక్షణ ఇచ్చి, అనంతరం పరీక్ష పెట్టి, ఉత్తీర్ణత పొందిన వారిని లైసెన్స్ సర్వేయర్ గా గుర్తిస్తామన్నారు. ఖమ్మం జిల్లాలో 640 లైసెన్స్ సర్వేయర్ కి దరఖాస్తు చేశారన్నారు. ఇతర రాష్ట్రాల్లో అధ్యయనం చేసి, నిరుద్యోగ యువతకు ప్రతి నెల ఆదాయం వచ్చే విధంగా కార్యాచరణ చేస్తామన్నారు.

ప్రతి రెవెన్యూ గ్రామానికి ఒక రెవెన్యూ అధికారైని నియమిస్తామని మంత్రి తెలిపారు. గతంలో విఆర్వో, విఆర్ఏ లుగా పనిచేసిన వారి నుండి ఆప్షన్లు తీసికొని, వారికి ఈ నెల 25న పరీక్ష నిర్వహించి, ఉత్తీర్ణత పొందిన వారిని గ్రామ రెవెన్యూ అధికారిగా నియమిస్తామన్నారు. రాష్ట్ర ఆర్థిక పరిస్థితి బాగోలేకున్నా, వచ్చిన ఆదాయంతో అప్పులు కడుతూ, అభివృద్ధి, సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నామన్నారు. కాస్త ఆలస్యమైన ఇచ్చిన మాట ప్రకారం ప్రతి హామీని అమలు చేస్తామని మంత్రి తెలిపారు.

# ఆ విషయంపై దమ్ముంటే లేఖ రాయాలి.. కేటీఆర్‌కు మహేష్‌గౌడ్ సవాల్

మొదటి పేజీ తరువాయి

గురువారం గాంధీభవన్ లో మీడియాతో మహేష్‌కుమార్ గౌడ్ మాట్లాడారు. నాడు కాంగ్రెస్ పార్టీలో ఉన్న నాగం జనార్ధన్ రెడ్డి ఈ పథకంపై కోర్టులో కేసు వేశారని గుర్తుచేశారు మహేష్‌కుమార్ గౌడ్ ఆయన పూర్తి ఆధారాలతో ఆ రోజు న్యాయస్థానంలో కేసు వేశారని మహేష్‌కుమార్ గౌడ్ స్పష్టం చేశారు. నాగం జనార్ధన్ రెడ్డిని బీఆర్ఎస్‌లో చేర్చుకుని ఆ కేసును నీరుగార్చేలా, వీగిపోయేలా వ్యవహారించారని ధ్వజమెత్తారు. నాగం జనార్ధన్ రెడ్డి ఇప్పుడు బీఆర్ఎస్‌లో ఉన్నారని.. అలాంటిది కేసీఆర్‌పై ఎలా కొట్లాడతారని ప్రశ్నించారు. తామంతా నీతిమంతులమని, బీఆర్ఎస్ హయాంలో చేసిన అవినీతి మాయమైనట్లు కేటీఆర్ మాట్లాడటం విడ్డూరంగా ఉందని విమర్శించారు. ఈ విషయంపై సీఎం రేవంత్‌రెడ్డికి లేఖ రాసి ఏ విచారణ కావాలో అడగాలని కోరారు.



ధైర్యం ఉంటే పాలమూరు రంగారెడ్డి ఎత్తిపోతల పథకంపై సీఐడీ విచారణ కావాలా? జ్యూడిషియల్ విచారణ కావాలా అన్నది ప్రభుత్వానికి కేటీఆర్ లేఖ రాయాలని సవాల్ విసిరారు. అప్పుడు అవినీతి ఏవిధంగా జరిగిందో బట్టబయలవుతుందని స్పష్టం చేశారు. నిజాయితీని నిరూపించుకునేందుకు కేటీఆర్ ముందుకు రావాలని మహేష్‌కుమార్ గౌడ్ ఛాలెంజ్ చేశారు.

# బ్యాంకర్లు ఆర్థికసాయం చేస్తే సమాజానికి మరింత ఉపయోగం: భట్టి విక్రమార్క

**న్యూస్ డెస్క్, 22 మే (కెరటం న్యూస్):** జూన్ 2వ తేదీన ఐదు లక్షల యువతకు రాజీవ్ యువ వికాసం పథకం కింద మంజూరు పత్రాలను అందజేసే లక్ష్యంతో బ్యాంకర్ల సహకారం అవసరమని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క తెలిపారు. ఈ పథకంలో రూ. 6,250 కోట్లు సబ్సిడీ రూపంలో యువతకు స్వయం ఉపాధి అవకాశాలు కల్పిస్తామని ఆయన పేర్కొన్నారు.



రైతు సంక్షేమం, పారిశ్రామిక అభివృద్ధి

రైతులకు రూ. 21 వేల కోట్లు రుణమాఫీ ద్వారా సహాయం అందిస్తామని, అలాగే రైతు బీమా ప్రీమియం ప్రభుత్వమే కడతామని తెలిపారు. పారిశ్రామిక అభివృద్ధి కోసం ఔటర్ రింగ్ రోడ్, రీజినల్ రింగ్ రోడ్ మధ్య వివిధ క్లస్టర్ల ఏర్పాట్లపై ప్రణాళికలు రూపొందిస్తున్నట్లు చెప్పారు.

మహిళా సంక్షేమం, విద్య

రాబోయే ఐదేళ్లలో మహిళా సంఘాలకు లక్షల కోట్లు వడ్డీ రహిత రుణాలు అందించాలని, విద్యార్థులకు ఫీజు రీయంబర్స్మెంట్, స్కిల్ యూనివర్సిటీ, మరియు అడ్వాన్స్‌డ్ టెక్నాలజీ సెంటర్ల ఏర్పాట్లు చేయాలని ఆయన తెలిపారు.

ప్రత్యేక కార్యాచరణ

పథకాలు సమర్థంగా అమలు కావడానికి బ్యాంకర్ల సహకారం అవసరమని ఆయన సూచించారు.

# నేను చేసిన తప్పేందో చెప్పాలి.. కాంగ్రెస్ నాయకురాలు సునీతా రావు

మొదటి పేజీ తరువాయి

ఈ మేరకు ఆలిండియా కాంగ్రెస్ కమిటీ ఆల్కాలాంబా, సునీతా రావుకు షోకాజు నోటీసులు జారీ చేసి వారంలోగా సమాధానం ఇవ్వాలని అల్టిమేటం జారీ చేశారు.

ఈ క్రమంలోనే ఇవాళ సునీతా రావు గాంధీభవన్ కు వెళ్లారు. అక్కడ పీసీసీ వైస్ ప్రెసిడెంట్ కుమార్ రావు తో భేటీ అయ్యారు. అనంతరం ఆమె మీడియాతో మాట్లాడుతూ.. ఆలిండియా కాంగ్రెస్ మహిళా కమిటీ నుంచి ఇప్పటి వరకు తనకు ఎలాంటి షోకాజు నోటీసు అందలేదని అన్నారు. ఒకవేళ నోటీసు వస్తే మీడియా సమావేశం పెట్టి అన్ని వివరాలు చెబుతానన్నారు. రాష్ట్ర కాంగ్రెస్ వ్యవహారాల ఇంచార్జ్ మీనాక్షి నటరాజన్ ను కలిస్తే ఆమె పీసీసీ చీఫ్‌ను కలవమన్నారని పేర్కొన్నారు. తనపై కావాలనే కొందరు తప్పుడు ప్రచారం చేస్తున్నారని.. అసలు తాను చేసిన తప్పేందో పార్టీ పెద్దలే చెప్పాలని సునీతా రావు ప్రశ్నించారు.

# కాళేశ్వరాన్ని కూల్చింది వాళ్లే అని నా డౌట్.. మాజీ మంత్రి కేటీఆర్ సంచలన వ్యాఖ్యలు

**న్యూస్ డెస్క్, 22 మే (కెరటం న్యూస్):** మాజీ మంత్రి కేటీఆర్ సంచలన వ్యాఖ్యలు చేశారు.. గురువారం మీడియాతో మాట్లాడిన ఆయన.. కాళేశ్వరంపై నిజానిజాలు త్వరలో తెలుస్తాయని ఆశాభావం వ్యక్తం చేశారు. “నా డౌట్ అయితే కాంగ్రెస్ వాళ్లే కూలగొట్టి ఉంటారు.. మేడిగడ్డ దగ్గర బాంబో లేదా మరొకటో పెట్టుంటారు.. కాంగ్రెస్‌లో అలాంటి పని చేసే వాళ్లు ఉన్నారు.” అని కాంగ్రెస్ నేతలపై సంచలన ఆరోపణలు చేశారు.

కాళేశ్వరం విషయంలో నిజం నిలకడగా తేలుతుందని కేటీఆర్ అన్నారు. ఒక బ్యారేజీలో 2 పగుళ్లు వస్తే ఏదో అయినట్లు చేస్తున్నారని విమర్శించారని.. కమీషన్ల నుంచి ప్రజల దృష్టిని మరల్చడానికే కాళేశ్వరం డ్రామా ఆడుతున్నారని మండిపడ్డారు. ఘోష్ విచారణ పూర్తయిందని అని చెప్పి.. ఇప్పుడు నోటీసులు ఇవ్వడమేంటని ప్రశ్నించారు.

సీఎం రేవంత్ రెడ్డిపై కేటీఆర్ విరుచుకుపడ్డారు. సీఎం రేవంత్‌రెడ్డి అపరిచితుడిలా ఉన్నారని విమర్శించారు. అపరిచితుడి సినిమాలోని రెమో, రాము పాత్రలు ముఖ్యమంత్రికి అబ్బుతాయన్నారు. అప్పు పుట్టలేదని రెమో అంటారు.. రూ.లక్షా 60వేల కోట్లు రాము అప్పు చేశారని వ్యాంగ్యాస్త్రాలు సంధించారు. ఉన్న డిక్లరేషన్లకే దిక్కు లేదని.. ఇప్పుడు నల్లమల డిక్లరేషన్ ఎందుకు? అని ప్రశ్నించారు. నెల రోజులుగా సీఎం మదిలో ఉన్నవి వరల్డ్ బ్యూటీస్, కేసీఆర్‌కు నోటీసుల అన్నారు. తాము కట్టిన వాటి ముందు వరల్డ్ బ్యూటీస్ ఫొటోలు దిగుతున్నారని కేటీఆర్ వ్యాఖ్యానించారు.

# రాష్ట్రంలో మాఫియాలు రాజ్యమేలుతున్నాయి..!

మొదటి పేజీ తరువాయి

తమ హయాంలో వర్షాకాలం కోసం 80 వేల టన్నుల ఇసుక నిల్వ చేసినప్పటికీ, టీడీపీ ప్రభుత్వం వచ్చాక రెండు నెలల్లోనే మొత్తం ఇసుకను ఊడ్చేశారని తెలిపారు.

అలాగే, అమరావతిలో జరిగిన అవకతవకలపై జగన్ ఆరోపణలు గుప్పించారు. గతంలో పూర్తయిన పనులకు మళ్లీ టెండర్లు పిలిచి.. మిగిలిన పనుల అంచనాలు విపరీతంగా పెంచి దోపిడీ చేస్తున్నారని మండిపడ్డారు. దీనికోసం జ్యుడీషియల్ ప్రివ్యూను తొలగించారని, రివర్స్ టెండరింగ్ ను రద్దు చేసి మొబలైజేషన్ అడ్వాన్సులు మళ్లీ తీసుకొచ్చారని తెలిపారు. ప్రస్తుత సచివాలయం, అసెంబ్లీ కాంప్లెక్స్‌లు కలిపి 6 లక్షల చదరపు అడుగుల నిర్మాణాలు ఉన్నా, కొత్తగా 53 లక్షల చదరపు అడుగులు నిర్మించాలనుకుంటుండటాన్ని జగన్ ప్రశ్నించారు. ఈ నిర్మాణాలు అవసరమేనా అని అడుగుతూ.. ప్రజాధనాన్ని వృథా చేస్తున్నారని ఆరోపించారు. ఒక్క కిలోమీటర్ రోడ్ నిర్మాణానికి రూ.50 కోట్లు ఖర్చు చేస్తుండడంపై కూడా విమర్శలు చేశారు.

ప్రస్తుత టీడీపీ ప్రభుత్వం ప్రజలపై అప్పుల భారం పెంచుతున్నారని జగన్ తెలిపారు. ఇప్పటికే అమరావతి కోసం రూ.52 వేల కోట్ల అప్పులు చేశారని, మొత్తం 77 వేల కోట్లు కావాలని ఫైనాన్స్ కమిషన్‌కు వివరించారని చెప్పారు. ప్రజలపై వేస్తున్న ఈ భారం తీవ్రంగా కలవరపెడుతోందన్నారు. టీడీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి సంవత్సరం దాటినప్పటికీ ఎలాంటి కొత్త పథకాలు అమలు కాలేదని ఆయన అన్నారు. అలాగే తమ ప్రభుత్వ హయాంలో అమలైన రైతు భరోసా, అమ్మఒడి, వసతి దీవెన, ఫీజు రీయింబర్స్మెంట్, ఆరోగ్య బీమా వంటి పథకాలు నిలిపివేయబడ్డాయని విమర్శించారు. ప్రజలకు నష్టమే తప్ప లాభం ఏమీ కనిపించడంలేదన్నారు.

అలాగే రాష్ట్రంలోని లిక్కర్ స్కాం ఆరోపణలపై జగన్ స్పష్టత ఇచ్చారు. తమ హయాంలో మద్యం విక్రయాలు తగ్గి, ప్రభుత్వ ఆదాయం పెరిగిందని తెలిపారు. 2023%-%24లో రూ.25,082 కోట్లు ఆదాయం వచ్చిందని, టీడీపీ హయంలో అదే ఆదాయం కేవలం రూ.2,623 కోట్లు మాత్రమేనని తెలిపారు. మద్యం షాపులు ప్రభుత్వమే నడిపితే లంచాల ప్రశ్నే లేదని, టీడీపీ హయంలో ప్రైవేటు మాఫియా చేతిలో వ్యాపారం జరిగిందని విమర్శించారు. మొత్తంగా వాస్తవాలను ఆధారాలతో ప్రజల ముందు ఉంచుతున్నామని జగన్ స్పష్టం చేశారు. చంద్రబాబు పాలనపై తీవ్ర విమర్శలు చేస్తూ.. ఇది దోపిడీ పాలన, అప్పుల పాలన, మాఫియా పాలనగా ముద్రవేశారని ఆగ్రహం వ్యక్తం చేశారు

# నరమేధం ఆపండి.. నంబాల కేశవరావు ఎన్కౌంటర్‌ను ఖండించిన ఎమ్మెల్సీ కోదండరాం

మొదటి పేజీ తరువాయి



కేశవరావు ఎన్‌కౌంటర్‌పై అనుమానాలు ఉన్నాయని, ఆయనను ఎక్కడో పట్టుకుని కాల్చి చంపారని అనుమానాలు వ్యక్తం అవుతున్నాయని అన్నారు.

ఈ ఘటనపై సిట్టింగ్ జడ్జితో విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు. మనుషులను ఈ విధంగా చంపడం ద్వారా ఒక రాజకీయాన్నో ఒక సిద్ధాంతాన్నో రూపు మాపాలనుకోవడం సరికాదన్నారు. అది అనవసర హింసకు దారి తీస్తుందని చెప్పారు. మనుషులను వెంటాడి చంపడాన్ని ఏ చట్టం కూడా అంగీకరించదని, అది మానవతావాదం కాదని అన్నారు. మావోయిస్టులు శాంతి చర్చలు కోరుకుంటున్నారని, కాబట్టి వారితో శాంతి చర్చలు జరిపి ఛత్తీస్‌గఢ్‌లో శాంతిని నెలకొల్పాలని ప్రభుత్వాన్ని కోరారు.

# తెలంగాణ రాజకీయాల్లో సంచలనం.. కేసీఆర్‌కు ఎమ్మెల్సీ కవిత లేఖ!

**న్యూస్ డెస్క్, 22 మే (కెరటం న్యూస్):** బీఆర్ఎస్ అధినేత, మాజీ సీఎం కేసీఆర్‌కు ఆయన కుమార్తె ఎమ్మెల్సీ కవిత లేఖ రాశారంటూ ఓ లేఖ సోషల్ మీడియాలో వైరల్ వైరల్ అవుతోంది. ఈ లేఖ మొత్తం 6 పేజీలు ఉంది. పాజిటివ్ నెగిటివ్ ఫీడ్ బ్యాక్ అంటూ పలు విషయాలను ఇందులో ప్రస్తావించారు. లేఖలో ముఖ్యంగా కవిత వరంగల్ బహిరంగ సభ విషయంలో అసంతృప్తి వ్యక్తం చేసినట్టు కనిపిస్తోంది. వరంగల్ సభలో కేసీఆర్ స్టేజ్ పైకి వచ్చే ముందు సీనియర్ నేతలు మాట్లాడి ఉండాల్సిందని లేఖలో పేర్కొన్నారు. అంతే కాకుండా 2001 నుంచి మన పార్టీలో ఉన్న వారు ప్రసంగిస్తే బాగుండేదని అభిప్రాయపడ్డారు.

పార్టీ నేతలకు యాక్సెస్ ఇవ్వడం లేదంటూ ఆవేదన వ్యక్తం చేశారు. ధూంధాం కార్యకర్తలను ఆకట్టుకోవడంలో మనం విఫలం అయ్యామని, బీజేపీపై ఇంకా బలంగా మాట్లాడితే బాగుండేదని కవిత అభిప్రాయపడ్డారు. భవిష్యత్తులో బీజేపీతో కేసీఆర్ పొత్తు పెట్టుకుంటారని చాలా మంది ప్రచారం చేస్తున్నారని, తాను కూడా బీజేపీ వల్ల చాలా ఇబ్బంది పడ్డానని పేర్కొన్నారు. బీజేపీని ఇంకొంచెం టార్గెట్ చేయాల్సిందేమో డాడీ అని పేర్కొన్నారు.

అంతే కాకుండా మొన్న ఎమ్మెల్సీ ఎన్నికల్లో మనం పోటీ చేయకుండా బీజేపీకి మద్దతు ఇచ్చామన్న మెసేజ్ కాంగ్రెస్ బలంగా తీసుకెళ్లిందని అన్నారు. ఈ పొలిటికల్ సినారియోను అడ్రెస్ చేయడానికి స్పెసిఫిక్ ప్రోగ్రామ్స్ గైడ్ లైన్స్ ఇస్తారని అంతా భావించారని, ఇప్పటికైనా 1-2 ప్లీనరీ పెట్టాలని సూచించారు. అంతే కాకుండా ఎస్సీ వర్గీకరణపై మాట్లాడలేదని, వక్ఫ్ చట్టం గురించి మాట్లాడలేదని పేర్కొన్నారు. లోకల్ బాడీ ఎన్నికలను పాత ఇంచార్జ్‌లకు అప్పజెప్పడం వల్ల వాళ్లు తెలంగాణ ఉద్యమకారులకు తగిన ప్రాధాన్యత ఇవ్వడంలేదని ఫీడ్ బ్యాక్ అందిందన్నారు. ఓవరాల్‌గా వరంగల్ సభలో ఇంకొంచెం పంచ్ ఆశించారని కానీ ఫైనల్‌గా లీడర్స్ క్యాడర్ సంతృప్తి చెందారని లేఖలో పేర్కొన్నారు.

# సనాతన ధర్మం మతోన్మాదం కాదు : పవన్ కళ్యాణ్ జీవ వైవిధ్యంపై కీలక వ్యాఖ్యలు”

మొదటి పేజీ తరువాయి

వినాయకచవితికి 54 రకాల ఔషధ మొక్కలని వినియోగిస్తామని.. 8 ఎకరాల నా పొలంలో దున్నడం మానేసి, అక్కడ సహజంగా పెరిగే మొక్కలు పెంచానన్నారు.. మన ఇంట్లో మనం ఏం చేయగలం అని ఆలోచించాలని.. కేంద్ర ప్రభుత్వం ఒక చట్టం పెడితే ఎంత బలంగా పని చేస్తుందో చూడాలని పిలుపునిచ్చారు. ఒక చిన్న మొక్కను నాటడం గొప్ప పని.. వనజీవి రామయ్య జీవితం మొత్తంలో లక్షల మొక్కలు నాటారన్నారు.. సీడ్ బాల్స్ ను తయారు చేయడం ఎంతో అవసరమని చెప్పారు. మడ అడవులు సహజంగా ఏర్పడ్డాయి.. సముద్రం దగ్గర ఉంటూ మనలని రక్షిస్తాయని.. ఇటీవల మడ అడవులను కూడా నాశనం చేస్తున్నారని గుర్తు చేశారు.. తాను చిన్నపుడు స్కూలులో చూసిన చెట్టును కొట్టేసిన ఘటన తనకు మొక్కలు పెంచే ఆలోచన తెచ్చిందని తెలిపారు. చదువుకున్న మన విజ్ఞానం అహంకారాన్ని ఇచ్చింది.. ప్రకృతి పట్ల నిర్లక్ష్యం పెంచిందన్నారు.

మనందరి బాధ్యత జీవ వైవిధ్యం పెంచడం.. ఒక పార్టీనో, ఒక వ్యక్తినో మనం నిందించలేమని పవన్ కళ్యాణ్ అన్నారు. “మన అవసరాలకు ముందుగానే పది చెట్లు నాటి ఉంచాలి.. చెట్లను, నదులను పూజించేవాళ్ళు మన పూర్వీకులు.. నదులను పూజించేవాళ్ళు.. సనాతనధర్మం ఒక మతోన్మాదం కాదు.. జంతుజాలం మన అన్నదమ్ములు.. మన జ్ఞానం మనం మర్చిపోకూడదు.. మనం మన రూట్స్ తెలుసుకోవాలి.. చిన్న మార్పు చాలా పెద్ద మార్పులకు దారి తీస్తుంది. ప్రకృతిపై మనిషి చేసే యుద్ధం ఎలా ఉందో తెలుసు. తూర్పు కనుమలలో శేషాచలం, నల్లమల, పాపికొండలు మనకు ఇంకా ఉన్నాయి. నియంత్రణ లేకుండా అడవులను నాశనం చేస్తున్నారు. కోనాకార్పస్ మొక్కలలో ఒక్క పక్షి కూడా నివాసం ఉండదు.. ప్రతీ జిల్లాలో ఒక బయో డైవర్సిటీ పార్క్ ని ఏర్పాటు చేస్తాం. పర్యావరణ విద్యా కేంద్రాలుగా బయోడైవర్సిటీ పార్క్ ఉంటుంది. ఒక పల్లెవనం ఉండాలి ప్రతీ గ్రామంలోనూ.. వందల ఎకరాలు ఇచ్చేస్తున్నాం కానీ బయోడైవర్సిటీకి కేటాయించడం లేదు.. మంగళగిరి చూస్తే చాలా బాగుంటుంది.. నర్సరీలు పెంచేటప్పుడు అటవీశాఖ మార్గదర్శకాలు పాటించాలి.. కోనాకార్పస్ ను ఉంచమని నర్సరీలు అడగడం అతిపెద్ద డ్యామేజీకి దారితీస్తుంది. కడియం నర్సరీలు కోనాకార్పస్ అమ్మకాలు ఆపడం గురించి ఆలోచించాలి. పక్షులు కూడా ఉండలేని మొక్కలు ఎలా అమ్ముతారు..” అని డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ వ్యాఖ్యానించారు

# హద్దులు దాటుతున్నారు.. ఈడీ దాడులపై తీవ్ర ఆగ్రహం



**న్యూస్ డెస్క్, 22 మే (కెరటం న్యూస్):** తమిళనాడులో రూ.1,000 కోట్ల మద్యం కుంభకోణం జరిగిందని ఈడీ ఆరోపించింది. మద్యం సరఫరా ఆర్డర్‌లను పొందడానికి డిస్టిలరీలు లెక్కల్లో చూపని నగదు ఇచ్చాయని పేర్కొంది. దీంతో తమిళనాడులో ఈడీ దాడులు చేస్తోంది. దీన్ని సవాల్ చేస్తూ మద్రాస్ హైకోర్టులో ప్రభుత్వం పిటిషన్ వేసింది. అయితే ఈ పిటిషన్ కొట్టేస్తూ ఈడీ దాడులకు అనుమతి ఇచ్చింది. దీంతో ప్రభుత్వం సుప్రీంకోర్టును ఆశ్రయించింది. సరైన ఆధారాలు లేకుండా ఈడీ దర్యాప్తు చేస్తోందని.. టాస్మాక్ సిబ్బందిని.. మహిళలను వేధిస్తున్నారని%ొ% గోప్యత.. ప్రాథమిక హక్కులను ఉల్లంఘిస్తున్నారని పిటిషన్‌లో పేర్కొంది. గురువారం పిటిషన్ విచారించిన ధర్మాసనం.. తక్షణమే దాడులు నిలిపివేయాలని మధ్యంతర ఉత్తర్వులు జారీ చేసింది. ఈ సందర్భంగా ఈడీ దాడులపై మండిపడింది. ఈడీ హద్దులు దాటి ప్రవర్తిస్తోందని ఆగ్రహం వ్యక్తం చేసింది.

సుప్రీంకోర్టు తీర్పుపై డీఎంకే ప్రభుత్వం హర్షం వ్యక్తం చేసింది. బీజేపీ నేతృత్వంలోని కేంద్ర ప్రభుత్వం రాజకీయ ప్రయోజనాల కోసం రాష్ట్ర ప్రతిష్టను దెబ్బతీస్తోందని ధ్వజమెత్తింది. వచ్చే అసెంబ్లీ ఎన్నికలను దృష్టిలో పెట్టుకుని ఈడీ దాడులకు కేంద్రం ఉసిగొల్పుతోందని ఆరోపించింది.

# జాతీయ వాదాన్ని వ్యతిరేకించడం దేశద్రోహమే

## కేంద్రమంత్రి సంజయ్ అసహనం

**తిరంగ్ యాత్రను అడ్డుకునేందుకు ప్రయత్నించిన వారిపై చర్యలు తీసుకోవాలి**

**బండి సంజయ్ ను కలిసి వినతిపత్రం సమర్పించిన నెల్లూరి**



**ఖమ్మం టౌన్, 22 మే (కెరటం న్యూస్):** జాతీయవాదాన్ని వ్యతిరికించడం కూడా దేశద్రోహంతో సమానమని కేంద్రమంత్రి బండి సంజయ్ అసహనం వ్యక్తం చేశారు. ఇటీవల ఖమ్మం నగరంలో జాతీయ వాదుల నేతృత్వంలో జరిగిన తిరంగ్ యాత్రను అన్యమతస్తులు అడ్డుకునేందుకు ప్రయత్నించిన విషయాన్ని భారతీయ జనతా పార్టీ ఖమ్మం జిల్లా అధ్యక్షులు నెల్లూరు కోటేశ్వరావు నేతత్వంలో జిల్లా నేతలు గురువారం కరీంనగర్ లోని బండి సంజయ్ క్యాంపు కార్యాలయంలో కేంద్ర మంత్రిని కలిసి వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా ఆరోజు జరిగిన దాడి తీరుతను గురించి కోటేశ్వరరావు మంత్రికి వివరించారు. తొలుత పోలీసులతో వాగ్ వివాదానికి దిగిన నిందితులు చివరకు దాన్ని మతవాదం కిందికి తీసుకురావడం శోచనీయమని బండి సంజయ్ విమర్శించారు. ఇలాంటి కార్యకలాపాలకు పాల్పడే వారిపై దేశద్రోహం కింద చర్యలు తీసుకోవాలని పోలీసు శాఖను కోరారు. బండి సంజయ్ ను కలిసిన వారిలో పార్టీ రాష్ట్ర నాయకులు సన్నే ఉదయ ప్రతాప్, ఇవి రమేష్, నున్న రవికుమార్, నంబూరి రామలింగేశ్వరరావు, సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.

# ఆంజనేయస్వామికి ఎంపీ వద్దిరాజు ప్రత్యేక పూజలు



**హైదరాబాద్ బ్యూరో, 22 మే (కెరటం న్యూస్):** రాజ్యసభ సభ్యులు వద్దిరాజు రవిచంద్ర గురువారం బంజారాహిల్స్ ఎమ్మెల్యే కాలనీలోని శ్రీఅభయాంజనేయస్వామి ఆలయాన్ని సందర్శించారు. హనుమాన్ జయంతి సందర్భంగా ఎంపీ రవిచంద్ర తన మనుమరాలు వద్దిరాజు సహశ్రికను వెంట తీసుకుని ఆలయాన్ని సందర్శించి గోత్ర నామంతో ప్రత్యేక పూజలు చేశారు. తెలంగాణ రాష్ట్రం, ప్రజలు శాంతి సౌభాగ్యాలతో సుభిక్షంగా వర్ధిల్లాలని, బీఆర్ఎస్ అధ్యక్షులు కల్వకుంట్ల చంద్రశేఖర రావు నిండూ నూరేళ్లు ఆయురారోగ్యాలతో జీవించాలని ఎంపీ వద్దిరాజు భగవంతున్ని వేడుకున్నారు. ఈ సందర్భంగా వేద పండితులు ఎంపీ వద్దిరాజుకు సాదర స్వాగతం పలికి కండువా, పూలదండతో సత్కరించి, పండ్లు, తీర్థ ప్రసాదాలు అందజేసి ఆశీర్వచనాలు పలికారు.



# అశోక్ కు నివాళులు అర్పించిన ఎంపీ వద్దిరాజు



**ఇనుగుర్తి, 22 మే (కెరటం న్యూస్):** తన స్వగ్రామం ఇనుగుర్తికి చెందిన సత్తూరి యాదగిరి పెద్ద కుమారుడు అశోక్ అకాల మృతి పట్ల రాజ్యసభ సభ్యులు వద్దిరాజు రవిచంద్ర తీవ్ర సంతాపం వ్యక్తం చేశారు.ఇటీవల అశోక్ అస్వస్థతకు గురికాగా, మెరుగైన చికిత్స కోసం ఎంపీ రవిచంద్ర సికింద్రాబాద్ యశోదా ఆస్పత్రిలో చేర్పించారు.ఆయనకు అందుతున్న వైద్య సేవలు, ఆరోగ్య పరిస్థితి గురించి ఎంపీ రవిచంద్ర డాక్టర్లు, కుటుంబ సభ్యులను ఎప్పటికప్పుడు తెలుసుకోవడమే కాక ఆస్పత్రికి పలుమార్లు స్వయంగా వెళ్లి పరామర్శించడం జరిగింది.దురదృష్టవశాత్తు అశోక్ బుధవారం సాయంత్రం తుదిశ్వాస విడిచారు.అశోక్ మృతదేహాన్ని ఎంపీ రవిచంద్ర తమ స్వగ్రామం మహబూబాబాద్ జిల్లా ఇనుగుర్తికి తరలించి తన అన్నదమ్ములు వద్దిరాజు కిషన్,వద్దిరాజు దేవేందర్, వద్దిరాజు వెంకటేశ్వర్లు,వద్దిరాజు మోహన్,వద్దిరాజు వెంకటేశ్వర్లు తదితర కుటుంబ సభ్యులతో కలిసి మృతదేహంపై పూలదండలు వేసి శ్రద్ధాంజలి ఘటించారు. వద్దిరాజు సోదరులు అశోక్ అంతిమయాత్రలో పాల్గొని,అంతిమ సంస్కారం జరిపించారు.అశోక్ అకాల మృతి పట్ల దిగ్భ్రాంతి వ్యక్తం చేస్తూ ఆయన తల్లిదండ్రులు యాదగిరి, సుజాత,భార్య,పిల్లలను ఎంపీ రవిచంద్ర తన సోదరులతో కలిసి ఓదార్చారు,బాధాతప్త హృదయంతో తమ ప్రగాఢ సానుభూతి తెలిపారు, కుటుంబానికి అండగా ఉంటామని మనోధైర్యాన్ని,భరోసానిచ్చారు.అశోక్ అంతిమయాత్రలో బంధుమిత్రులు, స్థానికులు పెద్ద సంఖ్యలో పాల్గొని తీవ్ర సంతాపం ప్రకటించారు.

# ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణంలో వేగం పెంచాలి

- **డబల్ బెడ్ రూమ్ ఇండ్ల లబ్ధిదారుల ఎంపిక పూర్తి చేయాలి**
- **మంత్రి పొంగులేటి**



**ఖమ్మం బ్యూరో, 22 మే (కెరటం న్యూస్):** ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణంలో వేగం పెంచాలని తెలంగాణ రెవెన్యూ, గృహ నిర్మాణం, సమాచార శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి అన్నారు. జిల్లా కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ తో కలిసి కలెక్టరేట్ కాన్ఫరెన్స్ హాల్లో ఇందిరమ్మ ఇండ్లు, భూ భారతి, ఏదులాపురం మునిసిపాలిటీ అభివృద్ధి పై అధికారులతో మంత్రి సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ... ప్రభుత్వ ప్రాధాన్యత కార్యక్రమాలను అధికారులు చిత్తశుద్ధితో పూర్తి చేయాలన్నారు. ఇందిరమ్మ ఇండ్ల క్రింద మొదటి విడతగా ప్రతి మండలంలోని ఒక్కో గ్రామాన్ని ఎంపిక చేసి జిల్లా వ్యాప్తంగా 875 ఇండ్లు మంజూరు చేయగా 475 ఇండ్లు గ్రౌండింగ్ అయినట్లు తెలిపారు. 420 కి పైగా ఇండ్లు బేస్మెంట్ లెవల్ పూర్తి చేయగా మొదటి విడత లక్ష రూపాయలు మంజూరు చేశామన్నారు. ప్రస్తుతం ఇండ్లు కట్టుకొవడానికి సిద్ధంగా లేని వారి నుండి అంగీకారం తీసుకొని అర్హులైన మరొకరికి మంజూరుకు చర్యలు తీసుకోవాలని అన్నారు. డ్వాక్రా ద్వారా రుణాలు అవసరమయ్యే వారికి అందించాలని, డ్రాప్ అయ్యే వారిని రెండో విడతలో కేటాయించాలని అన్నారు. ప్రతి సోమవారం విడతల వారి డబ్బును మంజూరు చేసి లబ్ధిదారులకు అందిస్తున్నామన్నారు. రెండో విడత క్రింద నియోజకవర్గానికి 3500 ఇండ్లు కేటాయించగా, జిల్లాకు 17983 ఇందిరమ్మ ఇండ్ల మంజూరు లక్ష్యం కేటాయించామన్నారు. 12276 ఇండ్లకు సంబంధిత నియోజకవర్గాల నుండి మంజూరు కు ప్రతిపాదనలు రాగా ఇప్పటివరకు 7212 ఇండ్లు ఇంచార్జ్ మంత్రివర్యుల ఆమోదం పొంది, జాబితా అందిందన్నారు. డబల్ బెడ్ రూమ్ ఇండ్లకు సంబంధించి, లబ్ధిదారుల జాబితా వచ్చే నెల మొదటి వారంలో పూర్తి చేయాలన్నారు. అర్హులైన లబ్ధిదారుల ఎంపికకు విధి విధానాలు ఖచ్చితంగా అమలు పర్చాలన్నారు. కదు పేదవారు, ఇండ్ల స్థలం లేనివారిని ఎంపిక చేయాలన్నారు.

భూ భారతి-2025 క్రింద ప్రతి మండలంలో అవగాహన సదస్సులు నిర్వహించామన్నారు. పైలట్ ప్రాజెక్ట్ క్రింద జిల్లాలోని నేలకొండపల్లి మండలాన్ని ఎంపిక చేసి, మండలంలోని అన్ని గ్రామాల్లో రెవెన్యూ సదస్సులు నిర్వహించి, భూ సమస్యల దరఖాస్తులు స్వీకరించామన్నారు. రెండో విడతగా జిల్లాలోని బోనకల్ మండలంలోని అన్ని గ్రామాల్లో రెవెన్యూ సదస్సులు నిర్వహించామన్నారు. నేలకొండపల్లి మండలంలో రెవెన్యూ సదస్సుల ద్వారా 3264 దరఖాస్తులు స్వీకరించగా, అందులో 1786 సాదా బైనామ దరఖాస్తులు ఉన్నట్లు తెలిపారు. కోర్ట్ నుండి సాదా బైనామా విషయమై కేస్ వెకేట్ కాగానే, దరఖాస్తులు పరిష్కారం చేసేలా విచారణ లు, సర్వేలు పూర్తిచేసి, సిద్ధం చేయాలన్నారు. ప్రభుత్వ భూమి, భూసేకర చేసిన భూమి విషయంలో జాగ్రత్తలు చేపట్టాలన్నారు. అసైన్డ్ భూముల్లో ఉన్న పేదవారికి పట్టాలు ఇచ్చేందుకు చర్యలు తీసుకోవాలని అన్నారు. సిసిఎల్ఏ నుండి ఏలాంటి ఉత్తర్వులు కావాలన్న సమాచారం ఇవ్వాలన్నారు. జిల్లాలోని ఎర్రుపాలెం మండలం మూలుగుమాడును రీ సర్వే కి పైలట్ గ్రామంగా ఎంపిక చేశామన్నారు. పైలట్ గ్రామంలో రీ సర్వే పూర్తిచేస్తే, భవిష్యత్తులో రాష్ట్ర మంతటికి రీ సర్వే కి సమస్యలు విషయమై క్లారిటీ వస్తుందన్నారు. రీ సర్వే లో ప్రజల ఫీడ్ బ్యాక్ తీసుకోవాలని, రీ సర్వే తో నక్ష తయారుతో మంచి జరుగుతుందా, సమస్యలు పరిష్కారం అవుతున్నాయా, ఎందరికి మంచి జరుగుతుంది వాస్తవ నివేదిక సమర్పించాలన్నారు. జూన్ 2 నుండి అన్ని మండలాల్లో సర్వేకి, మండలానికి 2 టీములు సిద్ధం చేయాలన్నారు. జిల్లాలో 465 మంది లైసెన్స్ సర్వేయర్లకు దరఖాస్తు చేశారని, రిటైర్, ప్రస్తుత సర్వేయర్లతో వీరందరికి శిక్షణ ఇవ్వాలన్నారు. శిక్షణ సోమవారం నుండి ప్రారంభించాలని, శిక్షణకు జిల్లాలో పక్కా ప్రణాళిక చేయాలన్నారు. ఏదులాపురం మునిసిపాలిటీ ని ఆదర్శంగా తీర్చిదిద్దే%శీ%దుకు చేపట్టాల్సిన పనుల విషయమై ప్రతిపాదనలు సమర్పించాలన్నారు. మునిసిపాలిటీలో 32 వార్డులు 60 వేల జనాభా ఉందన్నారు. పారిశుద్ధ్యం, పెండింగ్ బిల్లులు, అనుమతులపై దృష్టి పెట్టాలన్నారు. వ్యర్థాల నుండి ఆదాయం సమకూరే విధంగా చర్యలు తీసుకోవాలని అన్నారు. కావాల్సిన సిబ్బంది ఏర్పాటు చేస్తామన్నారు. ప్రభుత్వ భూమిని గుర్తించి, రక్షణ చేయాలన్నారు. త్రాగునీటి, రోడ్లు, సదుపాయాల, హై టెన్షన్ వైర్ల తరలింపునకు చర్యలు తీసుకోవాలని అన్నారు. తీగల వంతెన నిర్మాణంలో ఇండ్లు కోల్పోయిన 28 మంది పేదవారికి ప్రత్యామ్నాయ స్థలం చూపాలన్నారు. తక్కువ మొత్తంలో అందంగా మునిసిపాలిటీ ని తీర్చిదిద్దేందుకు ప్రణాళిక చేయాలన్నారు. సమీక్షలో జిల్లా కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ మాట్లాడుతూ, ఇందిరమ్మ ఇండ్ల వేగవంతానికి నియోజకవర్గానికి ఒక ప్రత్యేక అధికారిని నియమించా మన్నారు. భూ భారతి క్రింద పైలట్ మండలాల భూ సమస్యల పరిష్కారానికి కార్యాచరణ చేశామన్నారు. ఎదులాపురం మునిసిపాలిటీ లో పారిశుధ్యం పై ప్రత్యేక శ్రద్ధ పెట్టామన్నారు. మునిసిపాలిటీ అభివృద్ధి కి ప్రాధాన్యత ప్రకారం పనులు చేపట్టనున్నట్లు కలెక్టర్ అన్నారు. ఈ సమీక్ష లో అదనపు కలెక్టర్ పి. శ్రీనివాస రెడ్డి, డిఆర్డీవో సన్యాసయ్య, జిల్లా పంచాయతీ అధికారిణి ఆశాలత, ఆర్డీవోలు నర్సింహారావు, రాజేందర్, పాలేరు నియోజకవర్గ ప్రత్యేక అధికారి రమేష్, ఏడి సర్వే అండ్ ల్యాండ్ రికార్డ్స్ శ్రీనివాసులు, ఎదులాపురం మునిసిపల్ కమీషనర్ శ్రీనివాస రెడ్డి, తహశీల్దార్లు వెంకటేశ్వర్లు, రమాదేవి, అధికారులు, తదితరులు పాల్గొన్నారు.



# రాజకీయ కక్షతోనే కేసీఆర్ పై కుట్రలు

## మాజీ ఎంపీ నామ

### తెలంగాణకు జీవనాడి కాళేశ్వరం.. దేశానికే గర్వకారణం



**హైదరాబాద్ బ్యూరో, 22 మే (కెరటం న్యూస్):** కాళేశ్వరం ప్రపంచంలోనే అతిపెద్ద ఎత్తిపోతల సాగునీటి పథకమని, దీని నిర్మాణంలో అక్రమాలు జరిగాయనే నిందారోపణలతో మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ కు నోటీసులు జారీ చేయడం రాజకీయ కక్ష సాధింపులో భాగమేనని బీఆర్ఎస్ మాజీ లోక్ సభ పక్ష నేత, ఖమ్మం మాజీ ఎంపీ నామ నాగేశ్వరరావు అన్నారు. దేశానికి గర్వకారణంగా, తెలంగాణ రాష్ట్రానికి జీవనాడిగా నిలిచిన ఈ ప్రాజెక్టు లక్షల ఎకరాల బీడు భూములకు సాగునీరందించి వ్యవసాయ రంగాన్ని బలోపేతం చేయడమే కాక ప్రజల దాహార్తి తీర్చిన ప్రాజెక్ట్ కాళేశ్వరం అని నామ వివరించారు. కేసీఆర్ దూరదృష్టితో నిర్మించిన కాళేశ్వరం ఎత్తిపోతల పథకం కేంద్ర ప్రభుత్వం నుండి అన్ని అనుమతులు సాధించి భారత దేశ నీటి పారుదల రంగంలో సరికొత్త రికార్డులు సృష్టించిందన్నారు. దీని వల్ల భూగర్భ జలాలు పెరగడంతో రైతులు మూడు పంటలు సాగుచేసే స్థితికి చేరుకున్నారన్నారు. ఈ ప్రాజెక్టు విశిష్టత గురించి తాను పలుమార్లు 17వ లోక్ సభ లో మాట్లాడటం జరిగిందని, దీనికి జాతీయ హోదా కల్పించి నిధులు కేటాయించాల్సిన అవసరం గురించి వివరించానని ఒక ప్రకటనలో నాగేశ్వరరావు పేర్కొన్నారు. దేశంలో నీటి కొరత రాకుండా నదుల అనుసంధానం విషయంలో జాతీయ స్థాయిలో ఒక విధానాన్ని తీసుకురావాలని తాను కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేసిన విషయాన్ని ఈ సందర్భంగా నామ గుర్తు చేశారు. రైతన్నల కడగండ్లు తీర్చిన కాళేశ్వరం ప్రాజెక్ట్ సృష్టికర్త కేసీఆర్ పాలనలో రాష్ట్రం సాధించిన అభివృద్ధిని తక్కువచేసే ప్రయత్నాలు, కుట్రలను ప్రజలు ఏ మాత్రం అంగీకరించరని ఆయన స్పష్టం చేశారు. కాళేశ్వరం ప్రాజెక్టు ఇప్పుడు, ఇక ముందు కూడా తెలంగాణ రాష్ట్రానికి, ప్రజలకు గర్వ కారణంగా నిలుస్తుందని నామ నాగేశ్వరరావు వివరించారు.

# జర్నలిస్టుల ఫోరం వాల్ పోస్టర్ ను ఆవిష్కరించిన మంత్రి పొంగులేటి

**31న హైదరాబాద్ లో జరిగే రజతోత్సవ వేడుకలకు జర్నలిస్టులు తరలి రండి**

**జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు ఆకుతోట ఆదినారాయణ.. చిర్రా రవి పిలుపు**




**ఖమ్మం కలెక్టరేట్, 22 మే (కెరటం న్యూస్):** తెలంగాణ యూనియన్ ఆఫ్ వర్కింగ్ జర్నలిస్ట్ (టి జె ఎఫ్) 25 సంవత్సరాల రజతోత్సవ వేడుకలు ఈనెల 31న హైదరాబాద్ లో అట్టహాసంగా జరగనున్నాయి. ప్రచార కార్యక్రమంలో భాగంగా టియుడబ్ల్యూజే టి జె ఎఫ్ వాల్ పోస్టర్ ను రాష్ట్ర రెవెన్యూ, గృహ, పౌర సంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి ఖమ్మం కలెక్టరేట్లో గురువారం ఆవిష్కరించారు. రజతోత్సవ వేడుకలు నిర్వహిస్తున్న సందర్భంగా జర్నలిస్టులకు మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి ఈ సందర్భంగా శుభాకాంక్షలు తెలియజేశారు. జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు ఆకుతోట ఆదినారాయణ.. చిర్రా రవి లు మాట్లాడుతూ.. ఈనెల 31న హైదరాబాద్ లో జరగనున్న తెలంగాణ జర్నలిస్టుల ఫోరం రజతోత్సవ సంబరాలను నిర్వహించబోతున్నామని, ఈ కార్యక్రమానికి ఉమ్మడి ఖమ్మం జిల్లా వ్యాప్తంగా జర్నలిస్టులు పెద్ద ఎత్తున తరలిరావాలని వారు పిలుపునిచ్చారు.

**24న పి. వి. శ్రీనివాస్ కు అభినందన సభ**

ఈ నెల 24న ఆర్ టి ఐ కమిషనర్ సీనియర్ జర్నలిస్ట్ పి. వి. శ్రీనివాస్ రావు కు ఖమ్మంలో ఆత్మీయ అభినందన సభను నిర్వహిస్తున్నామని, ఈ కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని కోరారు.ఈ కార్యక్రమంలో ఎలక్ట్రానిక్ మీడియా జిల్లా కార్యదర్శి శెట్టి రజనీకాంత్, జిల్లా ఉపాధ్యక్షులు ప్రశాంత్ రెడ్డి, వనం నాగయ్య, మందుల ఉపేందర్, దుంపల భాస్కర్,శ్రీధర్ శర్మ, ఖమ్మం ప్రెస్ క్లబ్ అధ్యక్షులు గుద్దేటి రమేష్ బాబు, కార్యదర్శి కొరకొప్పుల రాంబాబు, కోశాధికారి బిక్కి గోపి, సహాయ కార్యదర్శి మూల జీవన్ రెడ్డి,నరాని సాయి,కెమెరామెన్ల సంఘం పృద్వి,గడ్డం సతీష్ శంకర్, నాయకులు వెంకటకృష్ణ, పి సి డబ్ల్యూ నరేష్, పొన్నెబోయిన పానకాలరావు, ఉల్లోజు రమేష్ , ఇసంపల్లి వెంకటేశ్వర్లు, నల్లమోతు శ్రీనివాస్,వెంపటి నాయుడు, వై. రాజేందర్ రెడ్డి, గిరి పాల్గొన్నారు.

## ముదిగొండ మండల స్థాయి శాంతి కమిటీ




**ముదిగొండ, 22 మే (కెరటం న్యూస్):** మత కుల ప్రాంతీయతత్వ ఘర్షణలు తలెత్తకుండా ఇటీవల ఖమ్మం నగరంలో జరిగిన సంఘటన నేపథ్యంలో ముదిగొండ మండల స్థాయి శాంతి కమిటీని పోలీస్ స్టేషన్ సిఐ ఓ మురళి ప్రకటించారు గురువారం ఉదయం ముదిగొండ పోలీస్ స్టేషన్లో సి మురళి అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో వివిధ రాజకీయ ప్రతినిధులు మత పెద్దలతో సిఐ కన్వీనర్ గా ఐదుగురు కమిటీ సభ్యులుగా నియమించారు మంకెన దామోదర్( సిపిఎం) బంకామల్లయ్య (భారాస) అల్లిక శ్రీకాంత్ (బిజెపి) మత పెద్దలు మహమ్మద్ అజ్గర్ షేక్ కాజా ను నియమించగా ఈ సమావేశంలో షేక్ నాగూర్ వేల్పుల భద్రయ్య బట్టు రాజు పొడకండ్ల శ్రీనివాసరావు తదితరులు ఈ సమావేశంలో పాల్గొన్నారు.

# ఆర్ఎంపీలకు చట్టబద్ధత కల్పించాలి

## తుంబూరి దయాకర్ రెడ్డి



**ఖమ్మం టౌన్, 22 మే (కెరటం న్యూస్):** గ్రామీణ క్షేత్రాలలో వైద్యం చేసే ఆర్ఎంపి లకు ప్రభుత్వం చట్టబద్ధత కల్పించాలని మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి క్యాంపు కార్యాలయ ఇన్చార్జి తుంబూరి దయాకర్ రెడ్డి అన్నారు. గురువారం టిటిడిసి భవనంలో తెలంగాణ మైనారిటీ గ్రామీణ వైద్యుల సంఘం 11వ మహాసభ సంఘం జిల్లా అధ్యక్షుడు షేక్ . హసన్ అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా ముఖ్య అతిథిగా హాజరైన దయాకర్ రెడ్డి మాట్లాడుతూ దివంగత ముఖ్యమంత్రి డాక్టర్ వైయస్ రాజశేఖర్ రెడ్డి గ్రామీణ వైద్యుల గుర్తింపుకు , చట్టబద్ధతకు కృషి చేశారని కొనియాడారు. ఆయన హయంలో ఆర్ఎంపీలకు వృత్తిపర శిక్షణ కల్పించడంతో పాటు వారికి సర్టిఫికెట్ల ను కూడా జారీ చేశారని తెలిపారు. గత కొన్ని సంవత్సరాలుగా ఈ ప్రక్రియ ఆగిపోయిన కారణంగా ఆర్ఎంపీలకు తీవ్రమైన నష్టాన్ని , సమస్యలను కలగజేసింది అని పేర్కొన్నారు. శిక్షణ ఆధారంగా లేకుంటే అనుభవపరంగా ఆర్ఎంపీలకు ఏ విధంగా చట్టబద్ధత కల్పిస్తారో ? తెలియదు గానీ ఆర్ఎంపీలకు మాత్రం తప్పనిసరిగా వృత్తిపర రక్షణకు చట్టబద్ధత అవసరమన్నారు. భవిష్యత్తులో ఎలాంటి సమస్యలు ఎదురైనా వాటిని చట్టబద్ధత తో ఎదుర్కోవచ్చని తెలిపారు. ఇంజక్షన్లు , మాత్రలు ఎవరో తయారు చేస్తే వాటిని ఆర్ఎంపీలు ఇస్తే , ఒకవేళ జరిగే ప్రమాదంలో ఆర్ఎంపీలకు బాధ్యులు చేయడం సమంజసం కాదన్నారు. ఆర్ఎంపీలు సమిష్టిగా తమ సమస్యల పై ఉద్యమాలు చేయాలని , అందుకు తమ వంతు సహాయ సహకారాలు ఉంటాయని స్పష్టం చేశారు. ఆర్ఎంపీలు చాలా కాలం నుండి కోరుతున్న సంఘం కార్యాలయం ఏర్పాటు పనిని త్వరలో పూర్తయ్యేటట్టు సహకారం చేస్తామన్నారు. ఆర్ఎంపి లకు వీటితోపాటు ఇంకా చాలా సమస్యలు ఉన్నాయని వాటిని కూడా ప్రాధాన్యత క్రమంలో పరిష్కరించేందుకు కృషి చేస్తానన్నారు. ప్రముఖ సామాజిక వేత్త స్పర్శ భాస్కర్ , రాజ్యాంగ పరిరక్షణ వేదిక వ్యవస్థాపక అధ్యక్షులు సయ్యద్ సాదిక్ అలీ లు ప్రసంగిస్తూ గ్రామీణ ప్రాంతాలలో వైద్యం చేసే ఆర్ఎంపీల సమస్యల సాధనకు తమ వంతు సహాయ సహకారాలు ఎల్లప్పుడూ ఉంటాయని పేర్కొన్నారు. తొలుత పహల్గాం ఘటనలో మృతి చెందిన అమాయక పర్యాటకులకు , మురళి నాయక్ కు సంతాపం ప్రకటిస్తూ , రెండు నిమిషాల పాటు మౌనం పాటించి , శ్రద్ధాంజలి ఘటించారు. ఈ మహాసభలో జిల్లా గౌరవ అధ్యక్షులు షేక్. హసన్ (నేరడ ) , వ్యవస్థాపక అధ్యక్షులు షేక్. నజిరుద్దీన్ , జిల్లా ప్రధాన కార్యదర్శి షేక్. జానీ మియా , జిల్లా కోశాధికారి షేక్ బాబు సాహెబ్ లు ప్రసంగాలు చేయగా నాయకులు షేక్. ఖాసిం, షేక్. చాంద్ పాషా ,షేక్. ఆ షా, షేక్ .మొహమ్మద్ సాహెబ్, షేక్. అమీర్ , షేక్ జానీ ( శ్రీరామ్ గిరి ) , షేక్. జానీ మియా ( మధిర), షేక్. రంజాన్ పాషా( పాలేరు ) , షేక్. మౌలానా (భద్రాచలం ) , షేక్. అఖిల్ అహ్మద్ (ఇల్లందు) , షేక్. పాషా ( ఇల్లందు ), షేక్. అజిముద్దీన్ ( పాల్వంచ ) , షేక్. మన్సూర్ అలీ , షేక్ నబి , షేక్, రబ్బాని , షేక్. అలీ , ఎండి. మహిముద్ (గుండాల ), షేక్. అహ్మద్ పాషా ,షేక్.వలి (సత్తుపల్లి ), షేక్. నభి, షేక్ .బాజీ , షేక్. ఇమామ్, షేక్ .బషీర్, అఖిల్, సలాం, సిరాజుద్దీన్ , ఎండి. యాకుబ అలీ ,మౌలానా ఖాన్ , షేక్ .గౌస్ , పాషా , షేక్ .సుభాని, షేక్. గౌస్, షేక్. నాగుల్ మీరా, షేక్. సైదా ,నాగుల్ మీరా, సుల్తాన్ బాబా ,సర్దార్ బహదూర్ ఖాన్, బాజీ, ముజిబుల్ రెహమాన్, వలి ,రెహమాన్, జానీ ,మహమ్మద్ జానీ, షేక్ .అబ్దుల్ కరీం, షేక్. హబీబ్, షేక్. సోందుమియా, షేక్. అహ్మద్, ఖాజా మియా, మోహినియా జానీ మియా ఎండి ఖాసీం ఎండి .హమీద్ అలీ, ఎండి. రహీం, ఖదీర్, శంషుద్దీన్ , షేక్. అలీ , హుస్సేన్ పాషా, ఎండి. ఖాజా, ఎండి .మౌలానా ,అన్వర్ పాషా ,చాంద్ పాషా, నయీమ్ ,ఉమర్, ఎండి. అబ్దుల్ ఖాదర్, జిలాని, ఎండి. అఫ్జల్ , ఉస్మాన్ పాషా ,మస్తాన్ పాషా ,రంజాన్ తదితరులు పాల్గొన్నారు.

# మే 24న ముహూర్తం



**స్పోర్ట్స్ న్యూస్ ,22 మే (కెరటం న్యూస్):** టెస్టులలో భారత క్రికెట్ జట్టును నడిపించే కొత్త నాయకుడెవరో ఈనెల 24న తేలనుంది. రోహిత్‌శర్మ రిటైర్మెంట్ నేపథ్యంలో టెస్టులకు కొత్త సారథిని రాబోయే శనివారం ప్రకటించేందుకు బీసీసీఐ ముహూర్తం ఖరారు చేసింది. కెప్టెన్‌తో పాటు ఇంగ్లండ్‌తో ఐదు టెస్టుల సిరీస్‌కు భారత జట్టునూ అదే రోజు ప్రకటించనున్నట్టు సమాచారం. టీమ్‌ఇండియా హెడ్‌కోచ్ గౌతం గంభీర్, చీఫ్ సెలెక్టర్ అజిత్ అగార్కర్ ముంబైలో ఇందుకు సంబంధించిన వివరాలను వెల్లడించనున్నట్టు బోర్డు వర్గాలు తెలిపాయి.

# హృదయానికి హత్తుకునే కథగా ‘నాతిచరామి’.. ట్రైలర్ రిలీజ్

**మూవీ న్యూస్, 22 మే (కెరటం న్యూస్):** కథాసుధలో భాగంగా ఈటీవీ విన్ మరో హృద్యమైన కథతో అలరించేందుకు సిద్ధమైంది. మలివయసులో భార్యభర్తల అనుబంధాన్ని తెలిపేలా ‘నాతిచరామి’ అనే కథను ప్రేక్షకుల ముందుకు తీసుకురానుంది. వేగేశ్న సతీష్ దర్శకత్వంలో రూపొందిన ఈ కథలో తనికెళ్ల భరణి, రాజ్యలక్ష్మి ప్రధానపాత్రల్లో నటించారు. మే 25నుంచి ఇది స్ట్రీమింగ్ కానుంది. తాజాగా దీని ట్రైలర్‌ను విడుదల చేశారు. ‘నాతిచరామి అని ప్రమాణం చేసింది మీరే.. కళ్లలో పెట్టుకొని చూసుకోవాల్సిందీ మీరే..’ అంటూ రాజ్యలక్ష్మి చెప్పిన డైలాగు ఆసక్తి కలిగేలా ఉంది



# అబ్బాయిలు ముందుకు.. అమ్మాయిలు ఇంటికి



**స్పోర్ట్స్ న్యూస్ ,22 మే (కెరటం న్యూస్):** మలేషియా మాస్టర్స్ బ్యాడ్మింటన్ టోర్నీలో తొలి రోజు భారత్‌కు మిశ్రమ ఫలితాలు దక్కాయి. పురుషుల సింగిల్స్‌లో కిదాంబి శ్రీకాంత్, హెచ్‌ఎస్ ప్రణయ్, కరుణాకరన్, ఆయుష్ శెట్టి రెండో రౌండ్‌కు ముందంజ వేయగా.. మహిళల సింగిల్స్‌లో పీవీ సింధు, మాళవిక బన్సోద్, ఉన్నతి హుడా, ఆకర్షి కశ్యప్ తొలి రౌండ్‌లోనే ఇంటిబాట పట్టారు. ప్రణయ్ **19-21, 21-17, 21-16**తో నిషిమెటో(జపాన్)పై పోరాడి గెలిచాడు.

కరుణాకరన్ **21-13, 21-14**తో చౌ టైన్ చెన్ (చైనీస్ తైపీ)ను చిత్తు చేశాడు. ఆయుష్ **20-22, 21-10, 21-8**తో బ్రియాన్ యంగ్ (కెనడా)ను ఓడించాడు. శ్రీకాంత్ **23-21, 21-13, 21-11**తో ఆరో సీడ్ లు గువాంగ్ జు (చైనా)కు షాకిచ్చాడు. కానీ ప్రియాన్షు రజావత్ **21-15, 21-17**తో జేసన్ (సింగపూర్) చేతిలో ఓడాడు. మిక్స్‌డ్ డబుల్స్‌లో ధ్రువ్ కపిల-తనీషా క్రాస్టో జోడీ **21-18, 15-21, 21-14**తో మౌలానా-జమిల్ (ఇండోనేషియా)ను ఓడిం చి రెండో రౌండ్‌కు అర్హత సాధించింది.

# గ్లిజరిన్ లేకుండానే కన్నీళ్లొచ్చేవి!



**మూవీ న్యూస్, 22 మే (కెరటం న్యూస్):** ‘మళ్లీరావా’ ‘దేవదాస్’ చిత్రాలతో తెలుగు ప్రేక్షకులు దగ్గరైంది ఆకాంక్ష సింగ్. ఓవైపు వెబ్ సిరీస్‌లలో బిజీ ఆర్టిస్టుగా ఉంటూ సినిమాల్లో కూడా రాణిస్తున్నదీ భామ. ఆమె కథానాయికగా నటించిన తాజా చిత్రం ‘షష్టిపూర్తి’ ఈ నెల 30న విడుదలకానుంది. రాజేంద్రప్రసాద్, అర్చన ప్రధాన పాత్రల్లో నటించిన ఈ చిత్రానికి పవన్‌ప్రభ దర్శకుడు. రూపేష్ నిర్మాత. ఈ సందర్భంగా బుధవారం ఆకాంక్షసింగ్ విలేకరులతో సినిమా విశేషాలను పంచుకుంది. తల్లిదండ్రుల గొప్పతనాన్ని, వారి త్యాగాన్ని తెలియజెప్పే ఈ చిత్రాన్ని కుటుంబ సమేతంగా చూడాలని కోరింది. తన పాత్ర గురించి చెబుతూ ‘ఈ సినిమాలో నేను గ్రామీణ ప్రాంతానికి చెందిన అచ్చ తెలుగమ్మాయి జానకిగా కనిపిస్తా. లంగావోణితో తెరపై కనిపించడం గొప్ప అనుభూతినిచ్చింది. రాజమండ్రి గోదావరి పరిసర ప్రాంతాల్లో నెలరోజులు షూటింగ్ జరిగింది. గోదారి అందాలకు మైమరచిపోయా’ అని చెప్పింది. రాజేంద్రప్రసాద్‌గారి దగ్గరి నుంచి ఎన్నో కొత్త విషయాలను తెలుసుకున్నానని, తామిద్దరం గ్లిజరిన్ అవసరం లేకుండానే ఎమోషనల్ సీన్స్‌ను రక్తి కట్టించామని, తెలియకుండానే కన్నీళ్లొచ్చేవని ఆకాంక్షసింగ్ పేర్కొంది.